క్లుప్తంగా

నేషనల్ క్రైమ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ జిల్లా సెక్రెటరీగా గోవర్ధన్



నియామకపత్రం అందుకుంటున్న గోవర్ధన్

ఇచ్చోడ: నేషనల్ క్రైమ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ జిల్లా సెక్రెటరీగా మండలంలోని కోకస్‌మన్నూర్ గ్రామానికి చెందిన పట్ల గోవర్ధన్ నియమితులయ్యారు. మండల కేంద్రంలో జిల్లా అధ్యక్షుడు షేక్ ఇమ్రాన్ మంగళవారం ఆయనకు నియామకపత్రాన్ని అందించారు. నేషనల్ క్రైమ్ కంట్రోల్ బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన ఉండాలి



ర్యాలీలో పాల్గొన్న రిమ్స్ డైరెక్టర్, డీఎంహెచ్ఓ

ఆదిలాబాద్‌టౌన్: బ్రెస్ట్ క్యాన్సర్‌పై ప్రతిఒక్కరు అవగాహన పెంపొందించుకుని ఆరోగ్యంగా ఉండాలని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ అన్నారు. బ్రెస్ట్ క్యాన్సర్‌పై మంగళవారం పట్టణంలో నిర్వహించిన అవగాహన ర్యాలీను డీఎంహెచ్ఓ డాక్టర్ కృష్ణతో కలిసి ప్రారంభించారు. అనంతరం వైద్యాధికారులు, వైద్య విద్యార్థులతోకలిసి ర్యాలీలో పాల్గొన్నారు. అంతకుముందు రిమ్స్ నుంచి ప్రారంభమైన మార్నింగ్ వాక్ కలెక్టర్ చౌక్ మీదుగా ఇందిరా ప్రియదర్శిని మైదానం వరకు సాగింది. వైద్యాధికారులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన

ఇంద్రవెల్లి: మండలంలోని ధర్మసాగర్ గ్రామంలో ఆర్టీసీ అదిలాబాద్ డిపో ఆధ్వర్యంలో మంగళవారం రోడ్డు భద్రతపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. సురక్షిత ప్రయాణం కోసం ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలన్నారు. శ్రీనివాస్, మధు తదితరులు పాల్గొన్నారు.

పురుడుపోసిన 108 సిబ్బంది

సిరికొండ: మండలంలోని రిమ్మ గ్రామానికి చెందిన గర్భిణి పెందూర్ సోనికి మంగళవారం పురిటినొప్పులతో బాధపడుతుంది. కుటుంబ సభ్యులు 108 సిబ్బందికి సమాచారం అందించడంతో వారు అక్కడికి చేరుకుని ఇంట్లోనే ప్రసవం చేయగా ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డలను చికిత్స నిమిత్తం పిట్టాబొంగారం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఈఎంటీ కాశీనాథ్, పైలెట్ రాజేష్ తెలిపారు.

గుస్సాడీ ఉత్సవాలు



నైవేద్యం సమర్పిస్తున్న గిరిజనులు

నేరడిగొండ: మండలంలోని గిరిజన గ్రామాల్లో గుస్సాడీ ఉత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. లింగట్ల, గోండగూడ గ్రామాల్లో పటేళ్ల ఇంటివద్ద గల గుస్సాడీ విగ్రహ జెండాల వద్ద గుస్సాడీ సామగ్రిని ఉంచి నైవేద్యాలు సమర్పించారు. ఈ సందర్భంగా భోగి నిర్వహించి దీపావళి వేడుకను ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ పటేల్ ఆశేరావ్, పూజారి మడవి ఆనంద్‌రావ్, పెందూర్ భీంరావ్, సిడం సంతోష్, పెందూర్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

ఇచ్చోడ: పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని జిల్లా పశువైద్యశాఖ అధికారి కిషన్ పేర్కొన్నారు. మండలంలోని అడేగామ(బి)లో పశువులకు మంగళవారం గాలికుంటు నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా వారం రోజులుగా పశువులకు ఉచిత గాలికుంటు నివారణ టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట మండల పశు వైద్యాధికారి గోవింద్‌నాయక్, సిబ్బంది శేఖర్, శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు. నేరడిగొండ మండలంలోని వడూర్ గ్రామంలో పశువైద్యాధికారి రాథోడ్ జీవన్ మంగళవారం పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఆయన వెంట పశువైద్యశాల సిబ్బంది ఉన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

బేల: ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో 29 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే పాయల్ శంకర్ మంగళవారం కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల్లో మధ్యవర్తులను నమ్మొద్దన్నారు. తహసీల్దార్ రఘునాథ్ రావు, ఎంపీడీవో మహేందర్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ సిడాం వామన్‌రావు, జైనథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరి అశోక్ రెడ్డి, వైస్ చైర్మన్ సవాపురే విలాస్, నాయకులు పాల్గొన్నారు.

భీం స్ఫూర్తిని కొనసాగించాలి

• ఎంపీ గోడం నగేశ్



భీం విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎంపీ గోడం నగేశ్

ఇచ్చోడ: నేటి యువత కుమురం భీం స్ఫూర్తిని కొనసాగించాలని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్ అన్నారు. మండలంలోని సిరిచెల్మలో మంగళవారం భీం జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా భీం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీ మాట్లాడారు. ఆదివాసీ హక్కుల కోసం పోరాటం చేసి అసువులు బాసిన భీం స్ఫూర్తితో ఆదివాసీలు మరింత అభివృద్ధి చెందాలన్నారు. ఆదివాసీల పిల్లలను ప్రభుత్వ, ఆశ్రమ, గిరిజన గురుకుల పాఠశాలలో చదువు నేర్పించాలని కోరారు. చదువుతోనే ఆదివాసీలు మరింత అభివృద్ధి చెందడానికి అవకాశం ఉందన్నారు. ఆదివాసీ నాయకులు కుంర కోటేశ్వర్, కొడప నగేశ్, ఆత్రం మహేందర్, మాజీ సర్పంచ్ కన్నమయ్య, నాయకులు లచ్చన్న, పెందుర్ తుల్సిరాం, తుప్తి గంగాధర్ పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్: హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో మంగళవారం నిర్వహించిన భీం జయంతి ఉత్సవాల్లో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పాల్గొన్నారు. భీం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కైలాస్‌నగర్: జిల్లా కేంద్రంలోని కుమురం భీం చౌక్‌లోని భీం విగ్రహానికి తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ నాయకులు ధర్మపురి చంద్రశేఖర్, కనక గంగారాం, కొట్నాక్ భరత్, మడావి సంతోష్, మెస్రం భరత్, గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.



ఉట్నూర్‌రూరల్: నివాళులర్పిస్తున్న ఎమెల్యే

ఎదులాపురం: కుమురంభీం స్ఫూర్తితో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడుతామని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవన్‌లో ప్రజా సంఘాల నేతలతో కలిసి కుమురం భీం జయంతిని నిర్వహించారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బండి దత్తాత్రి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి కిరణ్, టీఏజీఎస్ జిల్లా అధ్యక్షుడు విష్ణు, ఆశన్న తదితరులు పాల్గొన్నారు.

‘డబుల్’ పనుల్లో వేగం పెంచాలి

• ఎమ్మెల్యే అనిల్‌జాదవ్



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

ఇచ్చోడ: డబుల్ రోడ్డు నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో చేపడుతున్న డబుల్ రోడ్డు పనులను మంగళవారం ఆయన పరిశీలించి సంబంధిత అధికారులతో మాట్లాడారు. వారం వ్యవధిలో రోడ్డుకు అడ్డంగా ఉన్న భగీరథ పైపులైన్, స్తంభాలు తొలగించి నూతన లైన్ పనులు పూర్తి చేయాలన్నారు. విద్యుత్ శాఖకు సంబంధించిన బిల్లును ఆర్‌అండ్‌బీ శాఖ ద్వారా చెల్లించేలా చర్యలు తీసుకుంటామన్నారు. శివాజీచౌక్, పాత బస్టాండ్ వద్ద నిర్మిస్తున్న కల్వర్టుల పనులు త్వరగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. నిర్మల్, ఆదిలాబాద్‌కు వెళ్లే ఆర్టీసీ బస్సులను బస్టాండ్ మీదుగా మళ్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రహదారికి ఇరువైపులా సైడ్ డ్రెయిన్ కోసం నిధులు మంజూరైనట్లు తెలిపారు. ఆయన వెంట విద్యుత్‌శాఖ ఎస్ఈ చౌహాన్, మిషన్ భగీరథ ఎస్ఈ వెంకటేశ్వర్లు, ఆర్‌అండ్‌బీ ఏఈ అరవింద్, పంచాయతీరాజ్ డీఈ రాజేశుడు, సీఐ భీమేశ్, ఎంపీడీవో లక్ష్మణ్, ట్రాన్స్‌కో ఏఈ రాజు, మాజీ ఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డి, బీఆర్ఎస్ మండల కన్వీనర్ కృష్ణారెడ్డి, నాయకులు గాడ్గే సుభాష్, తిరుమల్‌గౌడ్, శిరీష్‌రెడ్డి, నర్వడే రమేశ్ ఉన్నారు.

కలెక్టరేట్ ఎదుట ఖాళీ బిందెలతో నిరసన



నిరసన తెలుపుతున్న కాలనీవాసులు

కైలాస్‌నగర్: తమ కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేసూత్ పట్టణంలోని కేఆర్‌కే కాలనీవాసులు మంగళవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. ఖాళీ బిందెలతో అక్కడి ప్రధాన ద్వారం ఎదుట బైఠాయించి తమ నిరసనను వ్యక్తం చేశారు. గత కొన్ని రోజులుగా కాలనీకి మిషన్ భగీరథ నీటి సరఫరా జరుగకపోవడంతో తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టరేట్ ఏవో రాంరెడ్డిని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు.

పాఠశాలల్లో వసతుల కల్పనకు కృషి

• ఎమ్మెల్యే అనిల్ జాదవ్



తాంసి! భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే, ఎంపీ

తాంసి: పాఠశాలల్లో వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. ఆదిలాబాద్ ఎంపీ గొడం నగేశ్‌తో కలిసి మంగళవారం మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో కేంద్ర ప్రభుత్వ నిధులు రూ.75 లక్షలతో నిర్మించనున్న అదనపు తరగతి గదుల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ విద్యార్థులకు వసతులు కల్పించి, వారి ఉన్నతికి తోడ్పాటునందిస్తామని పేర్కొన్నారు. విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలని సూచించారు. ఎంపీ నగేశ్ మాట్లాడుతూ తాను మంత్రిగా ఉన్నప్పటి నుంచి తాంసి ఆశ్రమ పాఠశాల అభివృద్ధి కోసం కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. పాఠశాలలో మౌలిక వసతులు కల్పించడం ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందుతుందని తెలిపారు. అనంతరం గ్రామస్తులు ఎమ్మెల్యే, ఎంపీలను సన్మానించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ రాజు, ఐటీడీఏ డీఈ సతీశ్, ఏఈ శేఖర్, హెచ్ఎం ఆడే సంతోష్, వార్డెన్ హరీశ్, నాయకులు తిరుమలగౌడ్, అరుణ్, కృష్ణ, గోవర్ధన్‌రెడ్డి, రజనీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

జిల్లాకేంద్రంలో..

ఆదిలాబాద్‌రూరల్: జిల్లాకేంద్రంలోని గిరిజన కళాశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్యే పాయల్ శంకర్‌తో కలిసి మంగళవారం భూమిపూజ చేశారు. గదుల నిర్మాణానికి కేంద్రప్రభుత్వం గిరిజన సంక్షేమ శాఖ నుంచి రూ.75 లక్షల నిధులు మంజూరు చేసిందన్నారు. అధ్యాపకులు తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



ఆదిలాబాద్‌టౌన్: కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు సునీల్ చౌహాన్ అన్నారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలకు సంబంధించిన కరపత్రాలను మంగళవారం జిల్లా కేంద్రంలోని రణదీవెనగర్ పాఠశాలలో ఆవిష్కరించారు. నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఆర్సీ ప్రకటించడంతో పాటు పెండింగ్ డీఏలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. ఉపాధ్యాయులకు రావాల్సిన జీపీఎఫ్, మెడికల్, సరెండర్, పెన్షన్ బిల్లులు, ఈ–కుబేర్ ద్వారా రావాల్సిన అనేక బిల్లులను విడుదల చేయాలన్నారు. ఈనెల 28న అన్ని మండల కార్యాలయాలు, తహసీల్దార్ కార్యాలయాల ఎదుట నిరసన కార్యక్రమాలు, జిల్లా స్థాయిలో నవంబర్ 5న కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటం

నేరడిగొండ: ఉపాధ్యాయుల సమస్యల సాధన కోసం పీఆర్టీయూ టీఎస్ నిరంతరం పోరాటం చేస్తోందని రాష్ట్ర నాయకులు బిక్కులాల్, సుభాష్, రామకృష్ణ, మోహన్‌రెడ్డి, తానాజీ, అజీజ్ పేర్కొన్నారు. మండలంలో మంగళవారం సభ్యత్వ నమోదు చేపట్టారు. డీఎస్సీ ద్వారా టీచర్లుగా ఉద్యోగాలు సాధించిన 8 మంది సంఘం సభ్యత్వాన్ని తీసుకున్నారు.

రాజకీయాల్లో మహిళలను ప్రోత్సహించడమే లక్ష్యం



మాట్లాడుతున్న ఆత్రం సుగుణ

ఉట్నూర్‌రూరల్: రాజకీయాల్లో మహిళలను ప్రోత్సహించడమే లక్ష్యంగా శక్తి అభియాన్, ఇందిరా ఫెల్లోషిప్ సంస్థలను ఏడాది క్రితం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రారంభించారని పార్టీ జిల్లా నాయకురాలు ఆత్రం సుగుణ తెలిపారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈనెల 18,19,20 తేదీల్లో మూడు రోజులు ఢిల్లీలో నిర్వహించిన శక్తి అభియాన్ జాతీయ కార్యవర్గ సమావేశంలో పాల్గొనామని వివరించారు. రాహుల్ గాంధీ సలహా సూచనలు అందించారని తెలిపారు. నాయకురాలు రాజవ్వ, కమల, బండారి కవిత, మల్లవ్వ, ఆశ, సరిత పాల్గొన్నారు.

రైతు భరోసాను చెల్లించాలి

ఎదులాపురం: రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసాను వెంటనే చెల్లించాలని అఖిలపక్ష రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు బండి దత్తాత్రి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ వరంగల్ డిక్లరేషన్‌లో ప్రకటించిన విధంగా ఎకరాకు రూ.7500 రైతు భరోసా చెల్లించడంతోపాటు రూ.2లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రైతు బీమా, పంటలకు ఫసల్ బీమా వర్తింపజేయాలని పేర్కొన్నారు. ఖరీఫ్‌లో రైతు భరోసా రైతుల ఖాతాల్లో జమ కాకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సమావేశంలో కమిటీ సభ్యులు దేవర్తి స్వామి,కొండ రమేశ్, రోకండ్ల రమేశ్, నారాయణ,దేవదాస్, వామన్, నారాయణ పాల్గొన్నారు.

నిందితులను శిక్షించాలి

ఎదులాపురం: పశ్చిమబెంగాల్‌లోని కలకత్తా జూనియర్ డాక్టర్ అభయపై అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.వెంకట నారాయణ డిమాండ్ చేశారు. ఐఎఫ్‌టీయూ జాతీయ కమిటీ పిలుపు మేరకు జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌక్‌లో పశ్చిమ బెంగాల్ జూనియర్ డాక్టర్స్ ఫెడరేషన్ చేస్తున్న పెన్‌డౌన్ పోరాటానికి మంగళవారం సంఘీభావం ర్యాలీ నిర్వహించారు. జిల్లా నాయకులు గౌరాల సుభాష్, నర్సింగ్, ప్రసాద్, పెర్క గంగమ్మ, దండేకర్ వామన్, మడావి గణేశ్, మెస్రం మారుతి, తౌఫీక్, కనక దత్తు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ శంకరన్ జయంతి

ఆదిలాబాద్‌రూరల్: జిల్లాకేంద్రంలోని మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఐఏఎస్ ఎస్ఆర్ శంకరన్ జయంతిని మంగళవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా అధ్యక్షుడు కొప్పుల రమేశ్, నాయకులు మెట్టు ప్రహ్లాద్, సింగరి అశోక్, పూసల ఊషన్న పాల్గొన్నారు.

పోలీసుస్టేషన్‌లో ఓపెన్‌హౌజ్

బోథ్: పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఓపెన్ హౌజ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఐ రమేశ్, ఎస్సై ప్రవీణ్ కుమార్‌లు విద్యార్థులకు ఆయుధాలను చూపించారు. వివిధ రకాల ఆయుధాలను ఎలా వాడాలో వారికి వివరించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

ఆదిలాబాద్‌రూరల్: పట్టణంలోని తిరుమలనగర్ కాలనీ మహిళా నూతన కమిటీని మంగళవారం ఎన్నుకున్నట్లు కాలనీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దేవిదాస్, ప్రేంసింగ్ తెలిపారు. అధ్యక్షురాలుగా స్నేహరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా చందా రూప, ఉపాధ్యక్షురాలుగా జాదవ్ అనురాధ, కోశాధికారిగా శతాల సుజాత, సంగీత ఎన్నికయ్యారు.

సంక్షిప్త వార్తలు

‘కంది’కి సన్మానం

కైలాస్‌నగర్: రాష్ట్ర వ్యవసాయమంత్రి తుమ్మల నాగేశ్వర్ రావును మంగళవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ఆదిలాబాద్ కాంగ్రెస్ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి సమావేశమయ్యారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీని బలోపేతం చేసినందుకు కంది శ్రీనివాస రెడ్డిని అభినందించి శాలువాతో సత్కరించారు. జైనథ్ మార్కెట్ కమిటీ ప్రమాణస్వీకారానికి రావాలని మంత్రిని ఆహ్వానించారు. కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. ఆదిలాబాద్ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంత రావు, ఏపీ మాజీ డిప్యూటీ స్పీకర్ బూరగడ్డ వేదవ్యాస్‌లను భోజనానికి ఆహ్వానించారు.

పరామర్శ

బజార్‌హత్నూర్: బజార్‌హత్నూర్‌లో ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన భగత్ వినోద్, పడిపెల్లి పోతన్న, అనారోగ్యంతో మృతి చెందిన ఇందూరి శ్రీహరి, ముత్యపు మాదవ్, సూర్యవంశి లక్ష్మీబాయిల కుటుంబాలను మంగళవారం ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పరామర్శించారు. అనంతరం వర్తమన్నూర్ గ్రామ సర్పంచ్ కుర్మే లక్ష్మణ్ పితృమూర్తి మృతి చెందిన విషయం తెలుసుకుని గ్రామానికి చేరుకుని లక్ష్మణ్, నారమ్మలను పరామర్శించారు. మాజీ ఎంపీపీ ప్రీతం రెడ్డి ఉన్నారు.

యాపల్‌గూడలో వైద్యశిబిరం

నేరడిగొండ: నేరడిగొండ పీహెచ్‌సీలో యాపల్‌గూడలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. హెచ్ఈఓ పవార్ రవీందర్.. గ్రామస్తులను పరీక్షించి అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు.

శ్రమదానం

నేరడిగొండ: మండలంలోని గాజిలి ఏళ్లుగా రోడ్డు సౌకర్యం లేకపోవడంతో గ్రామస్తులు శ్రమదానం చేసి మంగళవారం రోడ్డు చదును చేశారు.

చదువుతోనే సమాజంలో గుర్తింపు

నేరడిగొండ: చదువుతోనే సమాజంలో గుర్తింపు ఉంటుందని, విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. ఇటీవల డీఎస్సీలో ఉపాధ్యాయులుగా ప్రభుత్వ కొలువులు సాధించి పోస్టింగ్‌పై మండలానికి వచ్చిన 12 మంది నూతన ఉపాధ్యాయులను సన్మానించారు. మంగళవారం మండల కేంద్రంలోని ఆయన నివాసంలో వారిని సన్మానించారు.

అయోడిన్ లోపంతో అనేక రుగ్మతలు

ఆదిలాబాద్‌టౌన్: అయోడిన్ లోపంతో అనేక రుగ్మతల బారిన పడతారని డీఎంహెచ్‌వో కృష్ణ అన్నారు. పట్టణంలోని బ్రాహ్మణవాడ ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం ప్రపంచ అయోడిన్ లోపం రుగ్మతల నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. పీఓ డీటీటీ నరేందర్ రాథోడ్, హెచ్ఎం స్వామి పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌రూరల్: అయోడైడ్ కలిగిన ఉప్పునే వాడావాలని మండల వైద్యాధికారి సర్ఫారాజ్ అన్నారు. మంగళవారం అంకోలి పీహెచ్‌సీలో గర్భిణులకు, సాధారణ రోగులకు ఆయోడైడ్ ఉప్పు వల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. హెల్త్ సూపర్‌వైజర్ సుభాష్, శకుంతల, శ్యామల, ప్రేంసింగ్, సమి, తిరుమల, ప్రతిమ తదితరులు పాల్గొన్నారు.

సనాతన ధర్మ పరిరక్షణకు పాటుపడాలి

ఆదిలాబాద్: సనాతన ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని శ్రీరామచంద్ర గోపాలకృష్ణ మఠాధిపతి యోగానంద సరస్వతి స్వామి అన్నారు. సనాతన ధర్మ పరిరక్షణ ధ్యేయంగా బెంగళూరు నుంచి అయోధ్య వరకు చేపట్టిన సైకిల్ యాత్ర మంగళవారం జిల్లా కేంద్రానికి చేరుకుంది. సైకిల్ యాత్రకు పట్టణంలోని శ్రీరామచంద్ర గోపాలకృష్ణ మఠం వద్ద మఠాధిపతి హిందూ సంఘాల నాయకులతో స్వాగతం పలికారు.

జాతీయస్థాయి వర్క్‌షాప్‌లో పెసా జిల్లా కోఆర్డినేటర్

ఉట్నూర్‌రూరల్: పెసా చట్టం ద్వారా ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీల సంప్రదాయ వివాదాల పరిష్కారం అనే అంశంపై జాతీయ స్థాయిలో భువనేశ్వర్‌లో రెండు రోజులు కార్యశాల నిర్వహించారు. ఉట్నూర్ ఐటీడీఏ పేసా జిల్లా కోఆర్డినేటర్ అర్క వసంరావు, ఐటీడీఏ ఏటూరునాగారం వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ కుమ్రం ప్రభాకర్‌లు పాల్గొన్నారు.

నేడు 2కే రన్

బోథ్: పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు పురస్కరించుకుని బుధవారం ఉదయం 5.45 గంటలకు 2కే రన్ నిర్వహించనున్నట్లు ఎస్సై ప్రవీణ్ కుమార్ తెలిపారు. యువకులు, ప్రముఖులు ప్రతి ఒక్కరు పాల్గొనాలని కోరారు.

నేడు సమావేశం

ఆదిలాబాద్‌రూరల్: ఈ–పాస్ పోర్టల్ 2024–25 విద్యాసంవత్సరం నుంచి ఎస్సీ విద్యార్థుల స్కాలర్‌షిప్ రెన్యువల్, ఫ్రెష్ దరఖాస్తు చేసుకునేందుకు వెబ్‌సైట్‌లో మార్పు చేశామని జిల్లా దళితాభివృద్ధి శాఖ అధికారి సునీత కుమారి ఓ ప్రకటనలో తెలిపారు. కేంద్రం నూతన మార్గదర్శకాలు తెలుసుకునేందుకు జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్, డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లతో బుధవారం మధ్యాహ్నం 2.30 గంటలకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

నేడు మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభం

కైలాస్‌నగర్: ఇందిరా మహిళా శక్తిలో భాగంగా మున్సిపాలిటీకి సంబంధించిన మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభానికి సిద్ధమైంది. మున్సిపల్ ఓల్డ్ బిల్డింగ్‌లోని మడిగెల్లో క్యాంటీన్‌ను ఏర్పాటు చేశారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లను కమిషనర్ ఎండీ ఖమర్ అహ్మద్ మంగళవారం పరిశీలించారు. బుధవారం ఉదయం 10గంటలకు కలెక్టర్ రాజర్షి.. క్యాంటీన్ ప్రారంభించనున్నట్లుగా కమిషనర్ తెలిపారు.

నేడు పొచ్చెర జలపాతం వద్ద,,

బోథ్: మండలంలోని పొచ్చెర జలపాతం వద్ద బుధవారం మహిళా శక్తి క్యాంటీన్‌ను ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ప్రారంభించనున్నారు. మండలంలోని అధికారులు, నాయకులు హాజరుకావాలని బీఆర్ఎస్ నేతలు కోరారు.

ఆర్థికసాయం అందజేత

ఉట్నూర్‌రూరల్: జైనూర్ మండలం జెండగూడ గ్రామానికి చెందిన ఆదివాసీ విద్యార్థిని మెస్రం సాయిశ్రద్ధ ఎంబీబీఎస్ సీటు సాధించటం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ఆదివాసీ ప్రధాన్ ఉద్యోగుల సంఘం తరపున రూ. 26 వేల ఆర్థికసహాయం అందజేశారు. అనంతరం సాయిశ్రద్ధను సన్మానించారు. నాయకులు ఆడ నగేశ్, గోవింద్‌రావు, మడావి శ్రీనివాస్, కుమ్ర సాయి కృష్ణ, కుమ్ర శ్రీనివాస్, శ్యాంసుందర్ పాల్గొన్నారు.

యువజన విభాగం ప్రధాన కార్యదర్శిగా నరేశ్



నరేశ్

ఆదిలాబాద్‌రూరల్: చేనేత ఐక్యవేదిక రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శిగా కుర్ర నరేశ్ నియమితులయ్యారు. చేనేత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు వీర మోహన్ మంగళవారం ఈ మేరకు ఉత్తర్వులు జారీచేశారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన నాయకులకు నరేశ్ కృతజ్ఞతలు తెలిపారు.

లారీ బోల్తా.. తప్పిన ప్రమాదం

నేరడిగొండ: మండలంలోని బుర్కపల్లి జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి లారీ బోల్తా పడింది. హైదరాబాద్ నుంచి నాగ్‌పూర్ పత్తి విత్తనాల లోడ్‌తో వెళ్తున్న లారీ బుర్కపల్లి వద్ద బోల్తా పడింది. ఆ సమయంలో వేరే వాహనాలు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. లారీ డ్రైవర్, క్లీనర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. కొంతమేర వాహనాల రాకపోకలు నిలిచిపోవడంతో స్థానికులు పత్తి విత్తనాలను పక్కన జరిపారు. అనంతరం ట్రాఫిక్ యదావిధిగా కొనసాగింది.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సైబర్‌క్రైం డీఎస్పీ హసీబుల్లా ఖాన్

ఆదిలాబాద్‌టౌన్: సైబర్ నేరాలపట్ల అప్రమత్తంగా ఉండాలని సైబర్‌క్రైం డీఎస్పీ హసీబుల్లా ఖాన్ అన్నారు. జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాల విద్యార్థులకు మంగళవారం సైబర్‌క్రైంపై అవగాహన కల్పించారు. సెల్‌ఫోన్‌లకు వచ్చే లింకులను ఓపెన్ చేయొద్దని సూచించారు. సైబర్ నేరగాళ్లు కొత్త పుంతలు తొక్కుతూ అక్రమాలకు పాల్పడుతున్నారని, జాగ్రత్తగా ఉండాలని పేర్కొన్నారు. విద్యార్థులు, యువత ఫోన్లకు దూరంగా ఉంటూ చదువుపై దృష్టి సారించాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ అతీఖ్ బేగం, లెక్చరర్లు రఘు, సైబర్‌క్రైం సిబ్బంది సంతోష్, అబ్దుల్ ఆహెద్ తదితరులు పాల్గొన్నారు.


జీవో 29 రద్దు చేయాలి

నేరడిగొండ: జీవో నం.29ను వెంటనే రద్దు చేయాలని గిరిజన లంబాడీల ఐక్యవేదిక (లైవ్) జిల్లా అధ్యక్షుడు మహేందర్ జాదవ్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి ఉద్యోగ, ఉపాధి రంగాల్లో పెద్దఎత్తున తెరచాటు జీవోలు వస్తున్నాయని తెలిపారు. గ్రూప్–1 నోటిఫికేషన్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అన్యాయం చేస్తూ ఓసీలు లబ్ధిపొందడం కోసమే జీవో 29 తీసుకువచ్చారని మండిపడ్డారు. టీఎస్పీఎస్సీ చైర్మన్ మహేందర్ రెడ్డి జీవోలు తీసుకువచ్చి అణగారిన పిల్లల పొట్ట కొడుతున్నారని వాపోయారు. ఈ జీఓలు రద్దు చేసే వరకు పోరాటాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

పోలీసుల విధులకు అటంకం కల్గించిన వారిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: పోలీసుల విధులకు అటంకం కల్గించిన 8 మందిపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు తెలిపారు. ఆయన కథనం ప్రకారం..గతనెల 21న మావల మండల పరిధిలోని ఎస్టీ వసతిగృహనికి చెందిన విద్యార్థి రాథోడ్ జితేందర్ అనుమానస్పదంగా మృతి చెందగా కొందరు విషయం తెలుసుకోకుండా పోలీసుల విధులకు అటంకం కలిగించారు. గంటల తరబడి రోడ్డుపై ఆందోళన చేయడంతో ప్రజల రాకపోకలకు అంతరాయం కలిగింది. దీనికి సంబంధించి 8మందిని అరెస్ట్ చేసినట్లు ఆయన వివరించారు.

జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థినులు

గుడిహత్నూర్: జిల్లాకేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో మంగళవారం జోనల్ స్థాయి క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించారు. మండలంలోని మన్నూర్ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చారు. 9వ తరగతి చదువుతున్న ఆర్.అమృత, ఎం.శుభాంగి, జె.దీక్ష, టి.రూపాలి, యు.ఆకాంక్ష ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. హెచ్ఎం సంతోష్ కుమార్, పీడీ వెంకటరమణ, పీఈటీ వినోదలు వారిని అభినందించారు.